క్లుప్తంగా

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను, ఆంక్షల్లేకుండా బీడీ కార్మికులకు జీవనభృతి, అర్హులకు రేషన్‌కార్డులు, ఇండ్లు, ఇండ్లస్థలాలు, కొత్త పింఛన్లు ఇవ్వాలని కోరుతూ ఈనెల 8న గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు పాల్గొని ధర్నా విజయవంతం చేయాలని కోరారు.

ముళ్లపొదలు తొలగింపు



రాయపూర్‌కాండ్లీ-గొడిసెరా రోడ్డుపై పొదలు తొలగిస్తున్న పోలీసులు

లోకేశ్వరం: ప్రమాదాల నివారణకు మలుపుల వద్ద ముళ్లపొదలు, పిచ్చిమొక్కల ను తొలగిస్తున్నట్లు ఎస్సై సక్రియానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని మన్మద్, రాయపూర్‌కాండ్లీ, గొడిసెరా గ్రామాల్లో మలుపుల వద్ద ఉన్న పొదలను పొక్లెయిన్ సాయంతో తొలగించారు. ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి నడిపితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏఎస్సై దిగంబర్, రామారావు ఉన్నారు.

నిర్మల్‌లో అక్రమ నిర్మాణాలు తొలగింపు

నిర్మల్‌టౌన్: జౌళి కాలువపై అక్రమ నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఇరిగేషన్ డీఈ నరేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్ సమీపంలో కొందరు జౌళి కాలువను ఆక్రమించుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు బుధవారం పొక్లెయిన్ సాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఏఈ మీనాజొద్దీన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో అధ్యాపకులు

కుభీర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం 40 మంది ఆర్ట్స్ విద్యార్థులకు అధ్యాపకులు సంపత్, శ్రీనివాస్, నర్సయ్య తమ సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ సునీల్ అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేశ్, శివరాజ్, మాధురి, మహేశ్, లింగన్న, గజేందర్ ఉన్నారు.

'ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలి'

కడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేయాలని బుధవారం కడెంలో ఆటోడ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంతో తమకు ఉపాధి కరువై.. కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వం పథకం రద్దు చేసి ఆటోడ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు. ఇందులో ఆటోడ్రైవర్లు చంద్రయ్య, శివ, జాకీర్, ఫసీ, చందు, మల్లేశ్, గంగన్న, తదితరులున్నారు.

మెట్ట పద్ధతి సాగుతో లాభాలు



పొలంలో రైతులతో ఏఈవో అంబాజీ

సోన్: మెట్ట పద్ధతిలో వరిపంట సాగు చేస్తే లాభాలు పొందవచ్చని సోన్ ఏఈఓ జాదవ్ అంబాజీ అన్నారు. బుధవారం మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో నవీన్ అనే రైతు మెట్ట పద్ధతిలో సాగు చేస్తున్న వరిపొలం పరిశీలించారు. ఏఈవో మాట్లాడుతూ మెట్ట సాగు విధానంలో వరి సాగు చేస్తే ఎకరాకు రూ.12వేల వరకు పెట్టుబడి ఆదా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు ఆశన్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ నల్లపోచమ్మ ఆలయ మూడో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు ఈశ్వరాచారి, హరీశ్‌కుమార్, రఘుచారి ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, సర్వతోభద్ర మండల ఆవాహనం, సర్వదేవతా హోమం, బలిహరణం, అన్నపూజ చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.నారాయణరావు, గౌరవాధ్యక్షుడు కావలి సంతోష్, నాయకులు బీసీ రాజన్న, ఘంటశాల గంగాధర్, నర్సింలు, బాబన్న, ఇస్తారి, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

మురుగు నిల్వకుండా చూడాలి



భైంసాలోని జెడ్పీ బాలికల పాఠశాలలో మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్

భైంసాటౌన్: వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల్లో మురుగునీరు నిల్వకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా బుధవారం పట్టణంలోని కిసాన్‌గల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలతోపాటు శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు గౌరీశ్, దత్తాత్రి, హెచ్‌ఎం గంగాప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సారంగపూర్: వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు అన్నారు. మండలంలోని బీరవెల్లిలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. మలక్‌చించోలి-బీరవెల్లి ప్రధాన రహదారిపై సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. నిల్వనీటితో దోమలు వ్యాప్తి చెందుతాయని.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారంలో రెండురోజులు డ్రైడే పాటించాలని ప్రజలకు సూచించారు. ఏపీఓ లక్ష్మారెడ్డి, ఈజీఎస్ సిబ్బంది, ఆశాకార్యకర్తలు తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: పరిసరాల్లో నీరు నిల్వకుండా చూడాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా బుధవారం మండలంలోని పోట్‌పల్లి, లోకేశ్వరం, ధర్మోర, పంచగుడి గ్రామాల్లో ఇంకుడుగుంతల నిర్మాణాలకు మార్కింగ్ చేశారు. ఈజీఎస్ టీఏ శారద, ఎఫ్‌ఏలు భూమేశ్, శ్రీనివాస్, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామంలో ఎంపీడీవో అబ్దుల్ సమద్ పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని సరఫరా చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.



సారంగపూర్: బీరవెల్లిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు



తానూరు: జౌలా(కే)లో..

పెంబి: స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మండలకేంద్రంతోపాటు శెట్‌పల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి నర్సింగారెడ్డి, ఎంపీడీవో రమాకాంత్ పర్యటించారు. పాత టైర్లు, కుండీల్లో నిల్వ నీటిని పారబోయించారు. ఏపీవో రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీ వాణీ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కుంటాల: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా బుధవారం మండలంలోని లింబా(బి), లింబా(కె) గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శులు రవిప్రసాద్, గంగాప్రసాద్, ఎఫ్‌ఏలు దేవేందర్, సాయి, తదితరులు ఉన్నారు.



లింబా(బి)లో పనులు పరిశీలిస్తున్న రహీం

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం సహాయనిధి చెక్కులను బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ టౌన్, మామడ, లక్ష్మణచాంద మండలాలకు చెందిన 279 మంది లబ్ధిదారులకు రూ.70లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో చెక్కు పంపిణీ చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ రైతువేదికలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ 21 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా గొల్లమాడ మాజీ సర్పంచ్ చెన్న మహేశ్ మాట్లాడుతూ.. గొల్లమాడ నుంచి బూరుగుపల్లి(జి) గ్రామం వరకు బీటీ రోడ్డు దెబ్బతిందని.. మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, ఆర్‌ఐ వేణుగోపాల్, పిప్పర వెంగళరావు, దీక్షిత్ పటేల్, వినోద్ రెడ్డి, అరవింద్, బాశెట్టి విజయ్‌కుమార్, కాల్వ లింగం, సాగర్, సత్యం పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ఖానాపూర్: సిరిసిల్ల, జనగామ కోర్టులో న్యాయవాదులపై పోలీసులు దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఖానాపూర్ న్యాయవాదులు అన్నారు. బుధవారం ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధుల బహిష్కరణకు పిలుపునిస్తూ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నేరెళ్ల సత్యనారాయణ, వెంకట్ మహేంద్ర, మట్టేరి రాజశేఖర్, ఖాజా, బాశెట్టి శివ, ఆసిఫ్ అలీ, కమలాకర్, పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: జనగామలో పోలీసులు న్యాయవాదులపై చేసిన దాడిని ఖండిస్తూ బుధవారం నిర్మల్ కోర్టు ఆవరణంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు మహేందర్, కవిత, నర్సారెడ్డి, గంగాధర్, నరేందర్, కొమ్మోజి, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

సోన్: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా చదువుపై మాత్రమే దృష్టి సారించాలని గ్రామీణ సపోర్టు ఫౌండేషన్ జిల్లా కోర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని సిద్దులకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, భూమారెడ్డి, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ముగిసిన వారసంత వేలం

ముధోల్: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారసంత నిర్వహణకు బుధవారం వేలంపాట నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి వారసంతకు వేలం నిర్వహించగా రూ.91వేలతో అదే గ్రామానికి చెందిన బోస్కె సాయినాథ్ దక్కించుకున్నట్లు ఈవో ప్రసాద్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేశ్, మాజీ ఉప సర్పంచ్ సంజీవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన నిర్మల్ డీఎస్పీ

ఖానాపూర్: ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్‌ను బుధవారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన జడ్జిని పట్టణంలో కలిసి మొక్క అందజేశారు. సీఐ సైదారావు, ఎస్సైలు లింబాద్రి, శంకర్ ఉన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం నిలిపివేయాలని దీక్ష

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం నిలిపివేయాలంటూ దిలావర్‌పూర్ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి, బుధవారం గ్రామస్తులు వినూత్న రీతిలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ స్థానిక నాయకులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఇందులో దిలావర్‌పూర్ గ్రామ రైతులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ డ్రైవర్లు ..డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్లకు పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బస్సు ఓవర్టేక్ చేస్తున్నప్పుడు ముందుగా వచ్చే వాహనాలను గమనించాలని, రోడ్డు క్రాస్ చేసేటప్పుడు పక్క నుంచి వచ్చే వాహనాలు గుర్తించి ముందుకెళ్లాలని సూచించారు. డ్రైవర్ ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరు తమ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలని కోరారు. ఆదిలాబాద్ రీజియన్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ దయానంద్, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ ఏఆర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి

వేధిస్తే 100కు డయల్ చేయండి

నిర్మల్‌టౌన్: ఆకతాయిలు వేధిస్తే ఆందోళన చెందకుండా 100కు డయల్ చేయాలని షీటీం పోలీసులు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవి వాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930 వంటి అంశాలను వివరించారు. ఇబ్బందులుంటే షీటీం ఎమర్జెన్సీ నెంబర్ 87126 59550కు ఫోన్ చేయాలని సూచించారు. షీటీం సిబ్బంది రమాదేవి, రాధిక, ఉపాధ్యాయులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

దస్తురాబాద్: పంటలపై రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని రేవోజీపేట క్లస్టర్ ఏఈవో కిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని రేవోజీపేటలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. ఏఈవో మాట్లాడుతూ రసాయనాలతో భూమి సారం కోల్పోయి దిగుబడి తక్కువ వస్తుందని పేర్కొన్నారు. ఫౌండేషన్ సభ్యుడు విజయ్, రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

నర్సాపూర్(జి): నేరాల నియంత్రణకు దుకాణాలు, హోటళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వ్యాపారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొందరు దుకాణదారులకు నోటీసులు అందజేశారు. కానిస్టేబుళ్లు వెంకట్, మహేందర్, కృష్ణ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని కార్మికుల నిరసన

ముధోల్: తమకు ఆరు నెలలుగా రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని మండలకేంద్రంలోని పంచాయతీ కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో శివకుమార్ అక్కడికి చేరుకొని వేతనం వచ్చేలా కృషి చేస్తానని నచ్చజెప్పడంతో కార్మికులు విధులో చేరారు. ఈవో ప్రసాద్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

బాసరలో సన్మానం

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న విలాస్‌రావు దీక్షిత్, గోపాల్సింగ్, పద్మ, సంజురావును తోటిఉద్యోగులు, అర్చకులు, వేదపండితులు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆలయ ఏఈవో సుదర్శన్‌గౌడ్, విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.


రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి

కుంటాల: మండలంలోని కల్లూరు వాసవి ఉన్నత పాఠశాలలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు సాయిలు, శ్రీనివాస్, సంతోష్, డైరెక్టర్లు హరిప్రసాద్, జానకీరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీపీకి సన్మానం

ఖానాపూర్: జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్న కల్వకుంట్ల వినోద్‌రావు ఉత్తమ పీపీగా ఎంపిక కావడంతో న్యాయవాదులు బుధవారం సన్మానించారు. ఖానాపూర్‌కు చెందిన పలువురు న్యాయవాదులు నిర్మల్‌లోని తన కార్యాలయంలో వినోద్‌రావును శాలువాతో సన్మానించారు.

సాఠే ఆశయ సాధనకు కృషి చేయాలి



జెండావిష్కరణలో నాయకులు

తానూరు: సాహిత్యరత్న అన్నాభావు సాఠే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నాభావుసాఠే క్రాంతి సేనా ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తం బాలేరావ్ అన్నారు. బుధవారం మండలంలోని కోలూరు గ్రామంలో సాఠే 104వ జయంతి నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. సాఠేను ఆదర్శంగా తీసుకొని దళితులు ఉన్నత చదువులు చదవాలని సూచించారు. అంతకుముందు సాఠే విగ్రహానికి పూజలు చేసి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్, సురేశ్ పటేల్, శ్రీనివాస్‌రెడ్డి, చిలింకర్ గంగాధర్, సాయినాథ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ నిరసన



బాసరలో ఎస్సైకి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

బాసర: ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పేర్కొన్నారు. బుధవారం బాసరలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు నిరసన చేపట్టారు. ముందుగా మాల కులస్తులు ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి తహసీల్దార్ పవన్ చంద్ర, ఎస్సై గణేశ్‌కు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు కొఠారి భూమన్న, అల్లం సతీశ్ మాట్లాడారు. దీనిపై రివ్యూ పిటిషన్ వేస్తామని.. ఎస్సీల వర్గీకరణ ఆపాలని డిమాండ్ చేశారు.

కడెం: ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని నేతకాని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గే వెంకటేశ్‌నేత బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీల వర్గీకరణతో కొన్ని కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తే నేతకాని కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు.

పోస్టల్ పథకాలు వినియోగించుకోండి



బీమా చెక్కును అందిస్తున్న దిలీప్‌కుమార్

లోకేశ్వరం: పోస్టల్‌లోని పొదుపు, బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ దిలీప్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రాజూర గ్రామంలో తపాలాశాఖ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించారు. మండల కేంద్రానికి చెందిన సాకలి ఈరన్న తపాలాశాఖలో ప్రమాద బీమా చెల్లించి ప్రమాదంలో మృతి చెందారు. ప్రమాద బీమా కింద మంజూరైన రూ.10 లక్షల చెక్కును వారి కుటుంబసభ్యుడు హరీశ్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర బ్యాంకుల మాదిరిగానే పోస్టాఫీస్ కూడా ఇంటర్నెట్ బ్యాంకింగ్ మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం సేవలను అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భైంసా మెయిల్ ఓవర్సీర్ నరేశ్‌కుమార్, పవన్, బీపీఎంలు దేవన్న, రాజన్న, వరుణ్‌రెడ్డి, అనురాధ, వీడీసీ చైర్మన్ దాసరి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఉట్నూర్-ఖానాపూర్ బస్సు నడిపించాలి



మాట్లాడుతున్న సునారికారి రాజేశ్

కడెం: ఉట్నూర్ నుంచి ఖానాపూర్ వయా కలమడుగు, దస్తురాబాద్, కడెం, నచ్చన్ఎల్లాపూర్, లింగాపూర్ మీదుగా బస్సు నడిపించాలని సీపీఎం(ఎల్) డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉట్నూర్‌లో ఆర్టీసీ డిపో ఉన్నా.. కడెం, ఖానాపూర్ వైపు ఒక్క బస్సు నడిపించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లింగన్న, గజ్జన్న, ధర్మయ్య, చిన్నుపటేల్ తదితరులు ఉన్నారు.

తల్లిపాలతోనే రోగనిరోధక శక్తి



భైంసాలో మాట్లాడుతున్న వైద్యురాలు ఫిర్దోస్

ఖానాపూర్: తల్లిపాలతోనే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని.. పుట్టిన బిడ్డకు గంటలోగా ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. బుధవారం మండలంలోని గోసంపల్లె సబ్‌సెంటర్‌లో, పట్టణంలోని ఆరో వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, అమానుల్లాఖాన్, పరిమి సురేశ్, కిశోర్‌నాయక్, కమిషనర్ మనోహర్, సిబ్బంది విమల, మురళి, గంగమణి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రం-1, అంగన్‌వాడీ కేంద్రం-6 పరిధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు సరోజ, విజయ మాట్లాడుతూ శిశువుకు ఆరునెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు తాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు కవిత, లక్ష్మీ, ఆయాలు, బాలింతలు, గర్భిణులు ఉన్నారు.

ఎంపీడీవో పరిశీలన

కడెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నిత్యం పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో అరుణ అన్నారు. బుధవారం మండలంలోని నవాబ్‌పేట్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా పిల్లల ఎత్తు, బరువు వివరాలను పరిశీలించి, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ ముల్కి సత్తెవ్వ, తదితరులున్నారు.

తల్లిపాలతో ఆరోగ్యం

భైంసాటౌన్: పుట్టిన బిడ్డకు గంటలోగా ముర్రుపాలు తాగించాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు ఫిర్దోస్ అన్నారు. బుధవారం పట్టణంలోని బైల్‌బజార్, కుంట, ఖాజిగల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వైద్యురాలు గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం ఉన్నారు.

'కఠిన చర్యలు తీసుకోవాలి'

లక్ష్మణచాంద: షాద్‌నగర్‌లో దొంగతనం పేరిట దళిత మహిళ సునీతపై దాడి చేసిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రవీందర్ మహరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఇన్‌స్పెక్టర్‌ను విధుల నుంచి తొలగించాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని కోరారు. కల్లూరు సుధాకర్, సొన్న భూమేశ్, వినోద్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. మరమ్మతులు చేయించరూ..



కుంటాల: మండలకేంద్రంలోని రెండోవార్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద చేతిపంపును ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో దెబ్బతింది. తాగునీరు, ఇతర అవసరాలు తీర్చుకునేందుకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ప్రత్యేకాధికారి, ఫోన్ : 95730 14799